# చదువు రాకపోతే?

ఉప్పల విజయలక్ష్మి

నరసమ్మ, పిల్లలు బస్సు దిగేసరికి సూర్యుడు నడినెత్తి మీదికొచ్చాడు.

ఆ గడ్డ మీద కాలు మోపగానే, నరసమ్మ కళ్ళు రెండూ నిండిపోయి దుఃఖం పొంగివచ్చింది. పెళ్ళి అయిన కొత్తలో సూరన్నతో కలిసి ఆ వూరు మొదటిసారిగా వచ్చినప్పుడు కొత్త చీర కట్టుకుని, తలనిండా పువ్వులు పెట్టుకుని నుదుట పావలా కాసంత బొట్టు పెట్టుకుని, ఉల్లాసంగా దిగింది బస్సు. ఎదురుగా చెట్టు క్రింద వున్న టీ బడ్డీలో యిద్దరూ భన్నుతిని టీ త్రాగారు. సంబరంగా ఖబుర్లు చెప్పుకుంటూ ఛెంగు ఛెంగున ఊళ్ళోకి నడకసాగించారు. అది జరిగి దాదాపు పదిహేను సంవత్సరాలయినా నరసమ్మ జ్ఞాపకాలలో అది నిన్న మొన్నటి విషయంలాగే వుంది. ఆ తరువాత కూడ రెండు మూడుసార్లు వచ్చిందిక్కడికి.

"ఏడుస్తున్నావా అమ్మా... అని పిల్లలు అడిగేసరికి, చటుక్కున కళ్ళు తుడుచుకుని, వాళ్ళతో పాటు అదే టీబడ్డీ దగ్గరికి నడిచింది.

పల్లెలోకి ప్రవేశించాక చాలామంది నరసమ్మ వంక తేరిపార చూడటం మొదలుపెట్టారు.

"ఎవరింటికి వెళ్ళాలి." అని ఒకరిద్దరు అడిగారు కూడ.

ఆమెని గుర్తుపట్టిన ఒకరిద్దరుమాత్రం.

"మన సూరయ్య భార్య నరసమ్మ కదూ. ప్చ్.. ఏంటో భగవంతుడు ఏ నాటికి ఎవరికి ఏం వ్రాసిపెట్టాడో మనం కానలేం. వాడు ఇక్కడ్నించి పట్నం వెళ్ళి ఇరవై ఏళ్ళు కావస్తున్నది. అక్కడ మొదట్లో ఏం కష్టపడ్డాడో గాని తరువాత స్వంత, రిక్షా కొనుక్కున్నాడు. పెళ్ళి చేసుకున్నాడు. భార్యని తీసుకొచ్చి మనందరికి చూపించి మురిసి పోయాడు. తరువాత ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇద్దరూ ఆడపిల్లలే. ఎదరయ్యితే ఏంలే. ముత్యాలలా గుంటారు. వాళ్ళనీ తీసుకొచ్చి మనందరికి చూపించి తెగ మురిసి పోయాడు. వాడి మురిపెం తీరకుండానే చావు వాడిని పొట్టన పెట్టుకుంది. వాడు చచ్చిపోయి సంవత్సరం అయింది కదా. మరిదిని తోడికోడల్ని చూద్దామని వచ్చినట్టుంది. పాపం. పిల్లల్ని తీసుకుని. ఈ శేషయ్య, భార్య, సూరన్న పోయినప్పుడు వెళ్ళి చూడ్డమే తప్ప మళ్ళి పట్నం వెళ్ళలేనట్టుంది" అని చెప్పుకుంటూ ఆమె వెనకే నడుచుకు వస్తుంటే, నరసమ్మలో దుఃఖం మరీ మరీ పొంగుకు రాసాగింది.

నరసమ్మ యింట్లో అడుగుపెట్టేసరికి, అప్పుడే భోజనం ముగించిన శేషయ్య చెయ్యి కడుక్కుంటూ కనిపించాడు. యాదమ్మ లొట్టలు వేసుకుంటూ పులుసూ అన్నం జుర్రుతోంది. పిల్లలు ముగ్గురూ, ఎంగిలి పళ్ళాలు ముందు కూర్చుని మామిడి టెంకలు చీకుతున్నారు. లోపలికి వచ్చిన వారిని ఒక్క క్షణం గుర్తు పట్టలేనట్టు చూసి, అంతలోనే 'ముఖంమీదికి నవ్వు తెచ్చుకుంటూ, "రా, అక్కా"యని యాదమ్మా, "రా వదినా అని శేషయ్యా ఒక్కసారే ఆహ్వానించారు.

పిల్లలు మామిడి టెంకలు చేత్తో పట్టుకుని పెరట్లోకి వెళ్ళిపోయారు.

"నమస్తే చిన్నాయనా, నమస్తే చిన్నమ్మా" అని రాధ, జయ చెప్తుంటే "ఏం తల్లీ బాగున్నారా? బాగా పొడుగయిపోయారు" అని వాళ్ళని పలకరించి, పిల్లల చేతులు కడిగి తీసుకు రావటానికి యాదమ్మ పెరట్లోకి వెళ్ళింది. శేషయ్య దుఃఖభారంతో మాట రాక మౌనంగా వాళ్ళ తలలు నిమురుతూ వుండిపోయాడు.

నరసమ్మ కళ్ళు ఒత్తుకుని, మరిది పిల్లల కోసం తమ బడ్డీ కొట్లో కొన్న బిస్కట్ల పొట్లం చంటివాడి చేతిలో పెట్టి "అన్నయ్యలక్కూడ పెట్టు" అంది.

యాదమ్మ మంచి నీళ్ళు తీసుకొచ్చి యిస్తూ, "నువ్వూ పిల్లలూ కాసిన్ని నీళ్ళు త్రాగి జరసేపు ఇలా కూర్చోండి. బువ్వ వండేస్తాను" అంది.

"అటువేపు రావటమే మానేశావేం మరదీ. మీ అన్నతో పాటే వదిన కూడ లేదనుకున్నావా" అంది నరసమ్మ.

"ఛ! అదేం మాటొదినా. రావాలంటే ఎప్పటికప్పుడు ఏదో ఇబ్బందనుకో-అసలు దీన్ని పట్నం తీసుకొచ్చి డాక్టరమ్మకి చూపించాలనుకుంటున్నాను. ఏదీ. తీరితేనా."

"యాదమ్మ కేమయింది?"

ఎలా చెప్పాలో తెలియని వాడిలా మౌనంగా వుండిపోయాడు శేషయ్య. "అదే అక్కా. ముగ్గురు పిల్లలయారుకదా. ఇంక ఆపరేషను చేయించుకో అని చెప్పింది. ఇక్కడికి అప్పుడప్పుడు వస్తుండే డాక్టరమ్మ. మొన్నోసారి ఇక్కడికి పది మైళ్ళ దూరంలో వున్న వూరిలో అదేదో ఆపరేషను క్యాంపు వేసి, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేశారు కూడ. అక్కడ చేయించుకోవాలంటే నాకు భయం అయింది. పట్నంలో అక్కుందికదా. అక్కడయితే ఇంకా పెద్ద డాక్టర్లుంటారు. నేను అక్కడే చేయించుకుంటా అన్నా. మీ మరిది సరే అన్నాడు. కాని ఇల్లు కదలటమే కుదరలేదు." అంది యాదమ్మ.

"అలాగనుకుంటే ఏనాటికీ కుదరదు. రేపు నేను పోయేటప్పుడు నా వెంట రండి" అంది నర్సమ్మ ఆప్యాయంగా.

"ఇప్పుడు కాదులే వదినా. ఎండలిలా వున్నాయికదా. నేను లేకపోతే పొలం బీడయి పోతుంది" అన్నాడు శేషయ్య.

"పంటలు బాగున్నాయా? కూర గాయలేమైనా పండిస్తున్నావా" యధాలాపంగానే అడిగింది నర్సమ్మ.

"ఏం బాగో-అయినా ఒక యకరం పొలంలో ఏం పండిస్తాను. ఆ పండిందేదో తిండికయినా చాలటం లేదు" ముభావంగా అన్నాడు శేషయ్య.

పొయ్యి క్రింద పుల్లలు ఎగసదోస్తున్న యాదమ్మ ఒకసారి కొన కంటితో భర్తనీ, తోటికోడల్నీ చూసి, మళ్ళీ అన్నం కలియబెట్టటంలో మునిగి పోయింది. అంతలోనే మళ్ళీ ఏదో గుర్తు వచ్చినట్టు కళ్ళు ముక్కూ తుడుచుకుంటూ, "బావయ్య కూడ ఇక్కడే వుండి ఆ పొలం చూసుకుంటూ, పండించుకుంటూ వుంటే, కలో గంజో త్రాగి మనం అందరం ఒక్క దగ్గరే పడి వుండేవాళ్ళం. రామలక్ష్మనుల్లా అన్న దమ్ము లిద్దరూ కలిసి వ్యవసాయం చేసుకుంటూంటే, ఊరిలో మరో మనిషి సాయం మనకి అక్కరలేక పోయేది" అంది.

"ముందు వీళ్ళకి బువ్వ పెట్టు. ఆ రామాయణం అంతా తీరిగ్గా చెప్పుదువు గాని" అని భార్యని కసురుకున్నాడు శేషయ్య.

"ఏమయింది మరిదీ... బస్సు దిగగానే బడ్డీ కొట్టులో రొట్టె తిన్నాంలే. అన్నానికి కాస్త ఆలశ్యం అయినా ఫరవాలేదు. చెప్పనీ.... అంది నర్సమ్మ, ఏం వినాల్సి వస్తుందో అని భయపడుతూనే.

"మనుషులన్నాక కష్టం, సుఖం వుంటూనే వుంటాయికదా. అవన్నీ తీరికగా చెప్పుకోవచ్చు. ముందు నీ విషయం పిల్లల విషయం చెప్పు. మీ కక్కడ బాగుందా" అని కుశలం అడిగాడు శేషయ్య.

"ఏం బాగులే, రోజంతా కష్టపడి సంపాదించుకున్నది తిండికి సరిపోతుందనుకో. పిల్లలు కూడ ఆసరా అవుతున్నారని మరో నాలుగిళ్ళలో పని పట్టుకున్నాను. కాని, ఖర్చులూ పెరిగాయికదా" అని నర్సమ్మ అంటూంటే,

"ఇక్కడ మా పనీ అలాగే వుందిలే" అంటూ మాట కలిపింది యాదమ్మ.

ఈలోగా అన్నం వుడికింది. ముగ్గురికీ సత్తు కంచాలు పెట్టి ఇంత ఉల్లి కారం వేసింది. పప్పు పులుసు వుండనే వుంది. వేడి వేడి అన్నం పిల్లలు ఆవురావురుమంటూ తిన్నారు. కాని నర్సమ్మకి మాత్రం ముద్ద గుటక పడలేదు. ఏవేవో విషయాలు గుర్తు వస్తుంటే, తను వచ్చిన పని ఏమవుతుందా అని దిగులు పడుతూ, ఏదో తిన్నాననిపించి చెయ్యి కడుక్కుంది.

కడుపులు నిండాక పిల్లలిద్దరూ చెరో మూల పడుకుని నిద్ర పోయారు.

"మీ అన్న పొలంమీద ఈ సంవత్సరం డబ్బేం రాలేదా? సంభాషణకి వుపక్రమిస్తూ అంది నర్సమ్మ. మళ్ళీ కాస్సేపుంటే, మరిది పొలం వెళ్ళిపోతాడేమో, వీలయినంత త్వరగా అతని చెవుల్లో తను వచ్చిన పని విషయం పడెయ్యాలని ఆమె ఆరాటం.

"ఈ పొలాల విషయం ఎంత చెప్పినా నీ కర్థం కాదు వదినా. దానికి ఎరువులనీ, ఇదనీ అదనీఎప్పుడూ ఏదో ఒక ఖర్చు వుంటూనే వుంటుంది. అదీ కాకుండా మీరెవరూ ఇక్కడ లేక పోవటంవల్ల పొలం పనులకి కూలి మనుష్యులని పెట్టాల్సి వస్తోంది. పొలంమీద వచ్చిన డబ్బు ఆ కూలికి సరిపోతోందనుకో-మా కయినా అంతే. పొద్దు పొడిచిన దగ్గరనుండి రాత్రి-దాకా మేమిద్దరం ఆ చేనులో రెక్కలు ముక్కలు చేసుకుంటాం. ఈ పిల్ల వెధవలు కూడా వాళ్ళకి చేతనయిన చిన్న చిన్న పనులు చేస్తున్నారు. ఆ పంట డబ్బు లెక్క చూస్తే మా అందరికీ కూలి డబ్బులు కూడ గిట్టుబాటవటం లేదనుకో" నిరాశగా అన్నాడు శేషయ్య.

నర్సమ్మ ఒక్క క్షణం మౌనంగా వుంది. "తన మనస్సులో మాట చెప్తే మరిది ఏమంటాడో, తన దగ్గర అంత డబ్బు లేదంటాడేమో. పోనీ తను తీసుకోలేకపోతే మరెవరికయినా చెప్పమనాలి. బేరం కుదరగానే నాకు ఖబురు పెట్టమని చెప్పి నేను వెళ్ళిపోవాలి. అప్పుడు మళ్ళీ వస్తాను" అనుకుంటోంది తనలో తనే.

"ఆమధ్య శనక్కాయలు అమ్మిన డబ్బులో ఖర్చులు పోను యాభై రూపాయలు మిగిలాయి. నేను పట్నం వచ్చినప్పుడు ఇద్దామని ఊరుకున్నాను. నువ్వు వెళ్ళే-టప్పుడు ఇస్తా" అన్నాడు శేషయ్య.

"మంచిది" అంది నర్సమ్మ. "అదేం పొలమో, పాతిక యాభై రూపాయలకంటె ఏ సంవత్సరమూ ఎక్కువ కళ్ళ జూడలేదు" అనుకుంది తనలో తనే.

దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం సూరన్న పొట్టచేత బట్టుకుని పట్నం వెళ్ళాడు. ఈ పల్లెలో అతనికీ, తమ్ముడు శేషయ్యకీ కలిపి రెండెకరాలు వుంది. తన వంతు పొలం బాధ్యత కూడ తమ్ముడికే వదిలి సూరన్న పట్నం చేరాడు.

అక్కడ అతనికి ఏపనీ దొరక్క, రిక్షా తొక్కటం మొదలు పెట్టాడు. బాగానే గడుస్తుండేది. అందులో సూరన్నకి తాగుడు, జూదం లాంటి దుర్వ్యసనాలు




లేకపోవటంవల్ల, వచ్చిన డబ్బులో కొంత తిండికి ఖర్చు చేసి, మిగిలినది జాగ్రత్త చేసుకునేవాడు.

ఆ సమయంలోనే అతనికి రాజయ్యతో పరిచయం అయింది. దానికి ముఖ్యమైన ఆకర్షణ రాజయ్య కూతురు నర్సమ్మ. రాజయ్య సలహా మేరకు బ్యాంకిలో అప్పు తీసుకుని స్వంత రిక్షా కొనుక్కున్నాడు. అదివరకటిలా ఎవరి పంచనో వుండ-కుండా, రాజయ్య వాళ్ళు బస్తీలోనే ఒక గది అద్దెకు తీసుకున్నాడు. ఓ మంచి రోజు చూసి నర్సమ్మ మెడలో తాళి కట్టాడు. ఆ పెళ్ళికి పల్లెనుండి శేషయ్య వచ్చి వెళ్ళాడు. తరువాత నర్సమ్మ ముచ్చట పడితే సూరన్న భార్యని తీసుకువెళ్ళి తమ పల్లె, పొలం అన్నీ చూపించాడు అక్కడున్న నాలుగు రోజులూ నర్సమ్మే వంట వడ్డనచేసి తమ గుడిసెకి యజ-మానురాలిలా మెలిగింది.

రిక్షా తొక్కి సంపాదించిన డబ్బుతోనూ, నరసమ్మ నాలుగిళ్ళల్లో పాచి పని చేసి సంపాదించి తెచ్చే డబ్బులోనూ కొంత ఆదా చేసి త్వర త్వరగా రిక్షామీది అప్పు తీర్చేయటం మొదలు పెట్టాడు సూరన్న. పెళ్ళయిన ఏడాదికే పెద్ద కూతురు రాధ పుట్టింది. రెండు నెలలు నర్సమ్మ సంపాదన లేకపోయినా ఎలాగో నిలదొక్కుకున్నాడు సూరన్న. ఆ తరువాతి సంవత్సరం జయ పుట్టింది. అప్పుడు నర్సమ్మకి చాలా జబ్బు చేసింది. ఆ జబ్బుతోనే ఆమెకి ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. దాంతో మరి పిల్లలు కలిగే అవకాశం వుండదని తెలిసినా, సూరన్నగాని, నర్సమ్మగాని ఏం దిగులు పడలేదు. నరసమ్మ బ్రతికి బయట పడటమే ఒక వరంగా భావించుకున్నారు. ఆ అనారోగ్యంలోంచి కోలుకోవటానికి నరసమ్మకి చాలా రోజులు పట్టింది. కాని అప్పటికి సూరన్న ఒక డి

సంపాదనతో యిల్లు గడవాలంటే, అందులో పసి పిల్లలకి పాలు, నరసమ్మకి మందులూ ఇవన్ని కొనాలంటే చాలా కటకటగా వుండేది. ఆ సమయంలో రాజయ్య కుటుంబం తమ కడుపులు కూడ కట్టుకుని, అప్పుడో యాభై, అప్పుడో ఫాతికాగా సూరన్నకి సహాయం చెస్తుండేది. మామగార్ను చేస్తున్న ఈ సహాయాన్ని కొండంత అండగా భావించుకున్న సూర్నన్న ఆ డబ్బు మాత్రం అప్పుగానే భావించుకుని, నరసమ్మ ఆరోగ్యం కుదుటపడి మళ్ళీ ఆమె సంపాదనలో పడ్డాక మెల్లి మెల్లిగా అదంతా తీర్చేశాడు. పిల్లలు కూడ తల్లి పనిలో ఆసరా అవసాగారు. మళ్ళీ సంసారం సంతోషంగా సాగుతోంది అనుకునేసరికి సూరన్నకి చావు ముంచుకు వచ్చింది.

అదంతా తలుచుకుంటూ, చమర్చిన కళ్ళని అద్దుకుని, "నేనా పొలం అమ్మేయాలనుకుంటున్నాను మరిదీ" అంది.

శేషయ్య వెంటనే ఏం మాట్లాడలేదు.

యాదమ్మ మాత్రం; "పిల్లదాని పెళ్ళి చేస్తావా?" అంది పదమూడేళ్ళు నిండిన రాధను చూస్తూ.

నర్సమ్మ ఔనన్నట్లు తలవూపింది.

"సంబంధం ఖాయం చేసుకున్నావా... అనడిగాడు శేషయ్య. ఆ అడగటంలో నాతో సంప్రతించకుండానే అన్ని విషయాలు నువ్వే చూసుకుంటున్నావా అన్న దెప్పి పొడుపు కనిపించింది నర్సమ్మకి.

## చదువు రాకపోతే?

"సంబంధం పరాయిదేం కాదు-మా అమ్మ వంక చుట్టం-మల్లేసు వాళ్ళు - మా బస్తీలోనే వుంటారు. మల్లేసు బుద్ధిమంతుడు. మేమంటే వల్లమాలిన ఆపేక్ష వాడికి. ఈమధ్య ఆటో రిక్షా నడపటం నేర్చుకుని లైసెన్సు తెచ్చుకుని, కిరాయి బండి తోలుతున్నాడు. స్వంత బండి కొనుక్కోవాలని వాడికి చాలా ఆశగా వుంది-పిల్ల పెళ్ళికి నాకూ డబ్బు కావాలిగదా. ఈ పొలం అమ్మేసి, తక్కువలో పెళ్ళి జరిపించి, మిగిలినది మల్లేశానికే అప్పుగా యిస్తాను. నే నిచ్చిన డబ్బూ, బ్యాంకివాళ్ళు ఇచ్చిన లోనూతో వాడు ఆటో రిక్షా కొంటాడు. మల్లేశం అంటే ఇంక నా అల్లుడేకదా, నెమ్మదిగా నే నిచ్చిన డబ్బు తరుస్తాడు. దాంతో జయమ్మ పెళ్ళి కూడ అయిపోతుంది. నేను శక్తి వున్నంత వరకూ పని చేసినా నాపొట్ట నేను పోసుకుంటాను ఆపైన భగవంతుడే వున్నాడు.

"ఇద్దరు అల్లుళ్ళుండగా నీకేం బాధలే-అయినా వదినా, నీ ఆలోచనయితే బాగానే వుంది గాని, పొలం అమ్మితే వచ్చిన డబ్బులో అప్పులు తీరగా నీ చేతిలో ఏమయినా మిగులుతుందా అన్నదే నా బాధ" అన్నాడు శేషయ్య నసుగుతూ.

"అప్పేమిటి?" బిత్తరపోయింది నర్సమ్మ.


"అన్న నీ కెప్పుడూ చెప్పలేదా?"


"ఊహూ."


"నీకు జబ్బు చేసినప్పుడు వెయ్యి రూపాయలు కావాలంటే, ఒకసారి అయిదు వందలు, ఇంకోసారి అయిదు వందలు పంపించాను. ఎంత ధర్మాసుపత్రయినా, మనం డబ్బు ఖర్చు చెయ్యందే, మనుషులు బ్రతికి బయట పడరుగదా. అందులోనూ పెద్దాపరేషనయి నువ్వు చావు బ్రతుకుల మధ్య వుంటే డబ్బు పంపించకుండా వుండటానికి నేను కిరాతకుడిని కానుగా. అందుకే ఇక్కడ అప్పు చేసి మరీ పంపించాను. సరే నువ్వు మామూలు మనిషివయి, పని పాటు చేసుకునేసరికి మరో రెండేళ్ళు పట్టింది కదా. ఆమధ్యలో మరో అయిదు వందలు పంపించాను...."

"ఈ విషయాలేవీ మీ అన్న నాతో ఎన్నడూ అనలేదు. మా నాయన అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బు కూడ లెఖ్ఖలు కట్టి తరువాత తీర్చేశాం. అంతేకాని...." అంటూ నిర్ఘాంత పోయింది నర్సమ్మ.

"అయితే నేను అబద్ధం ఆడుతున్నానంటావా? అన్నె వ్రాయించిన వుత్తరాలున్నాయి. చూపిస్తాను. అసలు నేనే వచ్చి నీకు చెప్దామనుకుంటున్నాను. ఏదో ఒకటి చేసి ఈ అప్పు తీర్చేయి లేకపోతే వడ్డీ పాపంలా పెరిగిపోతుంది అని- అన్న నీ తో, ఏం చెప్పలేదూ అంటే, పొలం మీది పంటతో అప్పు తీర్చేయి అని నాతో అన్నాడు. పొలంమీది పంట డబ్బు ఖర్చులకే పోగా ఇంక పాతికో పరకో మిగిలితే వాటితో వడ్డీ కూడ





తీరదని ఆ డబ్బు మీకే పంపే వాడ్ని. ఆ డబ్బు తీసుకునేవాడు. ఎన్నిసార్లడిగినా ఈ అప్పు సంగతి మాట్లాడేవాడు కాదు." నరసమ్మ నీళ్ళు కారి-పోయింది. "పోనీ నాతో నయినా ఈ మాట ముందు చెప్పొచ్చు."

"ఇదుగో వదినా, ఇంతచేస్తే చివరికి నాకు మిగిలింది నిష్ఠూరమే ముంచంతా ఈ వ్యవహారం అన్న చూసుకుంటాడనుకున్నాను. తరువాత అన్న పోయాడు. నువ్వు పుట్టెడు దుఃఖంలో వున్నావు. ఈ మాట వింటే మరీ దిగులు పడతావు అని చెప్పలేదు. ఇహ ఇప్పుడు పట్నం వచ్చి నీకు చెప్పా-లనుకుంటూంటే, నువ్వే వచ్చావు." అని లేచి వెళ్ళి పెట్టెలోనుండి నాలుగు ఇన్‌లాండు కవర్లు తెచ్చి నర్సమ్మ చేతి కిచ్చాడు.

"ఈ వుత్తరాలు నాకేందుకు. నాకేం చదువొచ్చా? పాడా?.... అయితే మరిప్పుడు ఆ అప్పు ఎలా తీర్చను?" దిగులుగా అంది.

"ఇక్కడ ఒక ఆసామీ వున్నాడు. మీ పొలం కొంటానన్నాడు. అయితే ధర కొంచెం తక్కువే ఇస్తా-నంటున్నాడు. నేనయితే క్రిందా మీదా పెట్టి, కనీసం అప్పుకి సరిపోయే డబ్బయినా రాబడదామని చూస్తున్నాను."

"అంతే అంటావా?"

"అంత కాకపోతే మరో దారి నువ్వే చెప్పు. పట్నంలో నువ్వు సంపాదించింది ఏమయినా...."

"అదేమిటి శేషూ, అక్కడ డబ్బే వుంటే, ఇవాళ ఇక్కడికి వచ్చేదాన్ని? వాళ్ళ నాన్న పేరు మీద ఈ పిల్లలకి ఆ పొలం అయినా వుండ నిచ్చేదాన్ని."

"మరయితే ఏం చేద్దామంటావు?"

నరసమ్మ మనస్సులో భరించలేనంత ఆవేదన బయలుదేరింది. దానిని ఎవరికి చెప్పుకున్నా ఎవరు మాత్రం ఏం చేయగలరు. తన అదృష్టంలో ఇంతే వుంది అనుకుని, "ఇహ నువ్వు చెప్పినట్లే చేద్దాము మరి." అంది గత్యంతరం లేక.

తరువాత నర్సమ్మ పిల్లలూ అక్కడ పది రోజులున్నారు. ఈ పది రోజులలో శేషయ్య ఎవరెవరో మనుష్యులని తీసుకొచ్చాడు. నరసమ్మచేత ఏవేవో కాగితాల మీద వేలు ముద్రలు వేయించుకున్నాడు. ఆ పొలం ఇంకొకరి పరం చెయ్యటం అయిపోయింది. నర్సమ్మ గుండెలు విచ్చిపోయినట్లయింది.

"ఈ వుత్తరాలతో ఇక పనేముంది. అప్పు తీరి-పోయిందిగా" అని శేషయ్య ఆ ఉత్తరాలు చించే-శాడు.

అవాళ ఉదయం అన్నంతిని పట్నం బయలు-దేరింది నర్సమ్మ పిల్లలతో. శేషయ్య మొదట చెప్పినట్టుగానే యాభై రూపాయలు, శనగకాయలు అమ్మగా మిగిలిన డబ్బు వదినగారి చేతిలో పెట్టాడు. పిల్లలిద్దరి చేతుల్లోనూ చెరో అయిదు పెట్టాడు.

ఇంట్లోంచి అడుగు బయట పెడుతూంటే, నర్సమ్మ కళ్ళు రెండూ నిండిపోయాయి. తను ఏమనుకుని ఈ వూరు వచ్చింది.? చివరికి ఏం జరిగింది? ఇహ ఈ వూరితో తనకి ఋణం తీరి-పోయింది. ఇన్ని సంవత్సరాలు తను ఈగడ్డ మీద కాపురం చెయ్యకపోయినా, ఇక్కడ నుండి ధన-రాసులు తర్లించుకుని వెళ్ళకపోయినా, ఈ పల్లెలో తనకేదో సంబంధం అనిపించేది. ఈ నాటితో తీరి-పోయింది, అనుకుంది.

"అక్కా మీ పొలం లేకపోయినా మేము వున్నాం. ఎప్పుడయినా వచ్చిపోతూ వుండు." అంది యాదమ్మ తెచ్చి పెట్టుకున్న ఆప్యాయతతో.

"మేమూ వస్తూంటాంలే. రేపు రాధ పెళ్ళి మా చేతుల మీదే జరిపించాలిగా. అన్నాడు శేషయ్య, గారపళ్ళు కనిపించేలా నవ్వుతూ.

"ఔను" అంది నర్సమ్మ.

* * *

పట్నంలో ఇల్లు చేరి, నర్సమ్మ తలుపుతాళం తీస్తుంటే వచ్చాడు రాజయ్య. "వెళ్ళిన పని అయిందా?" అంటూ.

"ఆ" అంది నర్సమ్మ ముక్తసరిగా.

"ఎంతొచ్చింది.?"

"ఎంతొస్తే నేం? అది అప్పుడే వడ్డీకి సరిపోయింది." అంది ఏడుస్తూ.

అటుగా వెళ్తున్న భూమయ్య ఆ ఏడుపు విని లోపలికివచ్చాడు. భూమయ్య వాళ్ళు బస్తీకి లీడరు-లాంటివాడు. అందరిలోకి కాస్త ఎక్కువ చదువు-కున్నవాడు.

"ఏంటి తాతా? చిన్నమ్మ ఏడుస్తోందెందుకు?" అనడిగాడు.

"మా ఆయన ఊరునుండి చాలాసార్లు డబ్బు తెప్పించుకున్నాడట. ఆ అప్పు వడ్డీతో పాటు తీర్చవద్దా?" ఉక్రోషంగా అంది నర్సమ్మ.

"చిన్నయ్య, ఊరునుండి డబ్బు తెప్పించు-కున్నాడా" విస్మయంగా అడిగాడు భూమయ్య.

"అవును మామరిది ఉత్తరాలు కూడ చూపిం-చాడు.

"నా దగ్గర అలాంటి ఖబుర్లు చెప్పకు చిన్నయ్య, తన తమ్ముడికి-- ఎప్పుడు వుత్తరాలు వ్రాయాలన్నా, నేనే వ్రాసి పెట్టే వాడిని డబ్బు కావాలని అతనెన్నడూ వ్రాయించలేదు. అసలు నువ్వు వుత్తరాలు చదివావా?"

"నాకూ, మీ చిన్నయ్యకి చదువొస్తే, ఉత్తరాలు నువ్వు వ్రాసి పెట్టటం ఎందుకు?"

అదీ పాయింటు. ఏవో ఉత్తరాలు చూపించి, ఇవి నీ మొగుడు వ్రాయించినవే. ఇందులో డబ్బు కావాలని వ్రాయించాడు. అని నీ మరది చెప్తే నువ్వు నమ్మేశావు. పద నేను కూడ వస్తాను. ఈసారి ఈ ఉత్తరాల్లో ఏముందో తేల్చుకుని మరీ వద్దాం" ఆవేశంగా అన్నాడు భూమయ్య.

"ఇంకెక్కడున్నాయి అవి. అప్పు తీరిపోయింది కదా అని, వాటిని చింపేశాడు." దీనంగా అంది నర్సమ్మ.

"ఎంత మోసం?" పళ్ళు నూరుకున్నాడు భూమయ్య.

ఈలోగా అక్కడికి మల్లేసువచ్చి విషయం అంతా

# ధర్మపథం



## ఆచారాల ప్రయోజనం

ప్రజల నిత్యజీవనం క్రమబద్ధంగా కొనసాగడానికి వారు ఎట్టి వ్యాధులూ లేకుండా ఆరోగ్యంగా ఉండడానికి మన ప్రాచీనులు కొన్ని నియమాలను ఏర్పాటు చేశారు. వాటిని జన సామాన్యం అలక్ష్యం చేయకుండా ఉండడానికి, అవి ఆచారాలని, వాటిని అతిక్రమించరాదనీ కట్టుదిట్టం చేశారు.

వేకువను లేచేటప్పుడు భగవత్ప్రార్థన చేస్తూ లేవాలి. తర్వాత కాలకృత్యాలు జరుపుకొని సమీపంలో ఉండే నదిలో గాని, తటాకంలో గాని, లేకపోతే కూపంలోని జలంతోగాని స్నానం చెయ్యవలసి వుంటుంది.తర్వాత పరిశుభ్రమైన బట్టలుధరించాలి. తర్వాత ఆయా వర్ణాలకు నిర్ణయించిన కృత్యాలు నిర్వర్తించి, ఆ తర్వాత మధ్యాహ్న సమయాన భోజనం చెయ్యాలి. అతిథులు వస్తే వారికి ఉన్నదానిలోనే పెట్టాలి గాని, లేదని చెప్పి పంపివెయ్యకూడదు.

నిద్ర లేవగానే పడకమీద కూర్చుండియే బెడ్ కాఫీ తీసుకుంటున్నవారికి ఇలాంటివి పిచ్చి ఆచారాలు గానే తోచవచ్చును.కాని, యివి అర్థంలేని పిచ్చి ఆచారాలేమీ కావు. నిద్ర లేవగానే లేనిపోని ఆలోచనలు మనస్సులో చోటు చేసుకోకుండా ఉండడానికి భగవంతుణ్ని ధ్యానించడం ముఖ్యం. ఇది కూడదని ఎవరయినా అంటారా? దంత ధావన చేసుకోకుండా పానీయం గ్రహించడం ఆరోగ్యానికి భంగం కలిగిస్తుంది గదా! "చన్నీటి స్నానంబు సత్తువనిచ్చు" అన్నారు, దాన్ని అమలు చేస్తున్న అనుభవజ్ఞులైన ఆరోగ్య సూత్రకారులెందరు. అలవాటు చేసుకుంటే, అది శ్రమ అనిపించదు. వేడి నీళ్ల స్నానానికి అలవాటు పడితే, అవి లభించనప్పుడు ఎంతో శ్రమ పడవలసి వస్తుంది.

ఇలాగే, అతిథిని తృప్తిపరచడం భారతీయుల ప్రధాన నియమం. ఇతరులకు శక్తి వంచన లేకుండా సహాయపడడం మానవ ధర్మం. ఈ కాలంలో అతిథి సత్కారం కరువైపోయింది. బిచ్చగాడికి బిచ్చం పెట్టడంలో సామాన్యులే నయం. శ్రీమంతుల గృహాల వైపు పోవడం వానికి సాధ్యంకాదు. శ్రీమంతులు పెంచే శునకాలు వారిని ఆ వైపు రానీయవు.

మన పెద్దలు నిర్ణయించిన ప్రతి ఆచారానికీ ఏదో ఒక ప్రయోజనం ఉండనే ఉంటుంది. మన సంప్రదాయాను సారమైన ఆచారాలు అర్థం లేకుండా ఏర్పడినవి కావు. వాటిని అలక్ష్యం చేయ కుండా ఆచరించడం ప్రతి వ్యక్తికీ ఎంతో ప్రయోజనకారి అని గ్రహించవలసి ఉన్నది.

– బులుసు వేంకటరమణయ్య.

---

తెలుసుకున్నాడు. అతనికి తల తిరిగి పోయినట్లయింది.

"అత్తా. మీకు చదువు లేకపోవటంవల్లే ఇది ఇలా జరిగింది. అయినా, అన్న పిల్లల్ని వదినగారిని ఇంతమోసం చేసినవాడు, నీ మరిది ఏం బాగుపడతాడులే." అన్నాడు మల్లేసు పళ్ళు కొరుకుతూ.

"ఇప్పుడు నా కనిపిస్తోంది. నలుగురు మనుష్యుల్ని తెచ్చి, నా కళ్ల ముందు నాటకం ఆడాడుగాని, అసలు ఆ పొలం నా మరిదే కాజేశాడేమో" అంది నర్సమ్మ గుండె బాదుకుంటూ

"ఇప్పుడు మనం చెయ్యగలిగేదేమీలేదా?" అన్నాడు రాజయ్య తన కూతురికి అన్యాయం అయిపోయిందనే బాధతో.

"దానికి దొరక్కుండా జాగ్రత్త పడ్డాడు శేషయ్య. మనం ఇంక చేసేదేముంది." అన్నాడు భూమయ్య–కాస్సేపు అక్కడవున్న వాళ్లందరూ ఈ మోసం గురించే చెప్పుకున్నారు.

"ఇదో, అత్తమ్మా మా పెళ్ళికి నువ్వు ఖర్చేం చెయ్యొద్దు. నేను ఆటో రిక్షా కొనుక్కోటానికి కూడ డబ్బు మరెక్కడో సంపాదించుకుంటాలే" అని మల్లేసు చెప్తుంటే రాధ పెళ్లి కూతురులా తలవంచుకుంది.

"నీ కడుపు చల్లగా చల్లటి మాట చెప్పావు. అయినా నేను మీకేం తక్కువ చెయ్యనులే." అంది ఆడపిల్ల తల్లి నర్సమ్మ.

"ఒరే భూమయ్యా ఇవాళ ఇలాంటి ఘోరం నా బిడ్డకి అయింది. రేపు మరొకరి కవుతుంది. దీనికంతకీ కారణం మాకు చదువు లేకపోవటమే గదా ఇవాళనుండి రాత్రిళ్ళు మా అందరికీ నువ్వు చదువు చెప్పాలి." అన్నాడు రాజయ్య.

"నేనీ మాట ఎన్నడో చెప్పాను. మీలో ఒక్కరూ వినలేదు. ఏదో ఒకటి, ఇలాంటి అనుభవం అయితేనే కాని బుద్ధిరాదు. ఎవరికీ– ఇవాళే మన రాత్రి పాఠశాలకి ప్రారంభోత్సవం చిన్నమ్మ చేతే చేయిస్తాను." అన్నాడు భూమయ్య.

గోడు గోడున ఏడుస్తున్న నర్సమ్మ, తడి కళ్లతోనే భూమయ్య వంక చూసింది. □